ఘాట్.. మంటలకు స్పాట్

- ప్రయాణిస్తున్న వాహనాల్లో చెలరేగుతున్న మంటలు
- ఇటీవల వరుసగా ఆరు ఘటనల్లో వాహనాల దగ్ధం
- షార్ట్ సర్క్యూట్, వైరింగ్‌లో సమస్యలతోనే ప్రమాదాలు
- వేసవిలో జాగ్రత్తలు తప్పవంటున్న ఆటోమొబైల్ నిపుణులు


దోర్నాలలో ప్రమాదంలో దగ్ధమవుతున్న కారు


శ్రీశైలం ఘాట్ రోడ్డు దగ్ధమవుతున్న కారు

పెద్దదోర్నాల:

ఎండలు క్రమేపీ ముదురుతున్నాయి. పెరుగుతున్న ఎండలతో వాతావరణం భగ్గుమంటోంది. వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ఘాట్ రోడ్లు, తదితర ప్రాంతాలలో ప్రయాణించే వాహనాల్లో తరచూ మంటలు చెలరేగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అనుకోని రీతిలో జరుగుతున్న ప్రమాదాలతో కొన్నిసార్లు వాహనాలు పూర్తిగా దగ్ధమవుతుండగా, మరికొన్ని సార్లు మంటల్లో చిక్కుకొని సజీవ దహనమవుతున్నారు. వాతావరణంలో ఏర్పడిన అధిక వేడిమి, వాహనాలల్లో వైరింగ్‌లో లోపాలు, షార్ట్ సర్క్యూట్ సమస్యలు, అంతర్గతంగా ఏర్పడిన లీకేజీలు, ఓవర్ ఓల్టేజ్, బ్యాటరీల్లో సమస్యలు తదితర కారణాలతో వాహనాల్లో మంటలు ఏర్పడి ప్రమాదాలకు లోనవుతున్నాయి. దీంతో దూర ప్రయాణాల్లో మరికొద్ది జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలంటున్నారు ఆటోమొబైల్ నిపుణులు

గ్యాస్ కిట్‌లతో జాగ్రత్త ..

గ్యాస్ కిట్‌ల విషయంలో నాణ్యమైన ప్రమాణాలు ఉన్న కిట్‌లు వాడకుండా సాధారణ నాసికరమైన కిట్‌లు వాడటం కూడా ప్రమాదాలకు కారణమంటున్నారు. కారు లాంటి వాహనాలల్లో స్టీరియో, ఆంప్లిఫైర్, ఊఫర్ లాంటి హంగుల కోసం ఒరిజనల్ వైరింగ్ కట్ చేయ కూడదు. అలా చేయటం వల్ల షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది. దీంతో పాటు పెట్రోల్ ట్యాంకులు నిండుగా కొట్టించడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి.


తుమ్మలబైలు జంగిల్ సఫారీ సమీపంలో దగ్ధమవుతున్న కారు

ఘాట్ రోడ్లలోనే అధిక ప్రమాదాలు..

ఘాట్ రోడ్లలో తరచూ ప్రయాణించే వాహనాలు అగ్ని ప్రమాదాలకు గురవుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణాలు కొసాగించి కొన్ని నిమిషాలు కూడా ఆగకుండా ఘాట్‌రోడ్లలోకి వాహనదారులు వెళ్తున్నారు. దీని వల్ల శ్రీశైలం లాంటి ఘాట్ రోడ్లలో ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మండుతున్న ఎండల తీవ్రతతో పాటు, వాహనాలల్లో మెయింటెన్స్, బ్యాటరీలో తలెత్తుతున్న సాంకేతిక కారణాలతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాల విషయంలో తీసుకుంటున్న అజాగ్రతల వల్లే మంటలు చెలరేగడానికి కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాస్తవానికి కారు హెడ్ లైట్ల విషయానికి వస్తే 60 నుంచి 55 ఓల్టేజి పవర్ ఉండే లైట్లు వాడతారు. కాని కొందరు కారు లైట్లు బాగా ఉండాలని 100 నుంచి 90 ఓల్టేజి పవర్ ఉండే హై లైట్లలను ప్రత్యేకంగా వినియోగిస్తున్నారు. దీని వల్ల కేబుల్ వేడై అగ్ని ప్రమాదం సంభవిస్తుంది. బ్యాటరీని రెగ్యులర్‌గా మెయింటెన్ చేయకపోవటం. బ్యాటరీలో హెచ్-2, ఎస్ఓ-4 లెవెల్స్ సరిగా ఉందో లేదో కూడా చెక్ చేసుకోకపోవడం ఇక కారణం. దీని వలన బ్యాటరీలో హైడ్రోజన్ గ్యాస్ పెరిగి బ్యాటరీ పేలే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలకు చెక్..

వాహనదారులు దూర ప్రయాణాలకు సంబంధించి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏడాదికి ఒక్క సారైనా గుర్తింపు పొందిన సెంటర్లలో సర్వీసింగ్ చేయించుకోవాలి. స్పేర్ పార్ట్స్ విషయంలో రాజీ పడకుండా నాణ్యమైనవి వేయించాలి. వైరింగ్ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో ట్యాంపరింగ్ చేయకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెట్రోల్, డీజిల్‌ను సగమే నింపుకోవాలి. ఇలా చేయడం వల్ల వాహనాల్లో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని సూచిస్తున్నారు.

ఘాట్‌రోడ్డులో వాహనాలు కాలిపోయిన ఘటనలు..

- మండల పరిధిలోని తుమ్మలబైలు వద్ద లోడుతో వెళ్తున్న ఓ టిప్పర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదానికి గురైంది. దీంతో గంట పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- జంగిల్ సఫారీ ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ కావటంతో ఓ కారులో మంటలు చెలరేగి కారు మొత్తం అగ్నికి ఆహుతైంది. దీంతో గంట పాటు వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.
- తుమ్మలబైలు ఘాట్‌లో ప్రయాణికులతో వెళ్తున్న ఓ తుఫాన్ వాహనంలో మంటలు చెలరేగటంతో కొద్దిపాటిలో ప్రయాణికుల ప్రమాదం నుంచి బయట పడ్డారు. లేదంటే భారీగా ప్రాణ నష్టం సంభవించేది.
- మండల కేంద్రంలో ఓ లారీలో షార్ట్ సర్క్యూట్‌తో హఠాత్తుగా మంటలు చెలరేగటంతో ల్యారీ క్యాబిన్ పూర్తిగా కాలిపాయింది. ఇలా ఎన్నో ఘటలను మండల పరిధిలో చోటు చేసుకున్నాయి. వాహనాల డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు.

మెయింటెన్స్ లేక పోవడం వల్లే ప్రమాదాలు..

కారు మెయింటెన్స్, బ్యాటరీలో తలెత్తుతున్న సాంకేతిక కారణాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. స్పేర్ పార్ట్స్ విషయంలో రాజీ పడకుండా నాణ్యమైన స్పేర్ పార్ట్స్ వేయించుకోవాలి. శ్రీశైలం ఘాట్‌లో ప్రయాణాలు చేసే ముందు వాహన ఇంజన్ కండీషన్‌ను సరిచూసుకోవాలి.

– షేక్.అర్షద్, కార్ మెకానిక్, పెద్దదోర్నాల


దోర్నాలలో మంటలంటుకుని తగలబడుతున్న లారీ

క్లుప్తంగా

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గుంటిగంగ అమ్మవారు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటి గంగ భవాని అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని తూర్పు గంగవరం సోమవరప్పాడు పంచాయతీ పరిధిలో ఉన్న అమ్మవారిని పక్కనే ఉన్న మల్లికార్జున స్వామి వారిని, నాగమ్మ తల్లి శిలలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని అర్చకులు పి.విజయ లక్ష్మి, ఎం.బాలరాజు, కామేశ్వర శర్మ అలంకరించారు. ఈఓ గుంటపల్లి వాసు, ఆర్‌పీ కే.ప్రసాద్, ఆలయ చైర్మన్ గురుబ్రహ్మం పాల్గొని భక్తులకు వసతులు కల్పించారు.

దేవాలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో వెలసిన గంగాభవానీ వేనూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం దగ్గర నాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు ఆదివారం నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్య పుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఉగాది పండుగకు ముందు మొక్కు ఉన్న భక్తులు ఆలయాల ప్రాంగణంలో పొంగళ్లతో మొక్కులు చెల్లించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

పుల్లలచెరువు కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు


లిల్లీ ప్రకాశ్‌వాణి

పుల్లలచెరువు: స్థానిక మండల కేంద్రంలో ఉన్న పుల్లలచెరువు కేజీబీవీలో ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లిల్లీ ప్రకాశ్‌వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి 6, ఇంటర్ తరగతుల్లో ప్రవేశాలకు అధికారులు ప్రకటన జారీ చేశారని చెప్పారు. మిగులు సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. ప్రక్రియ పారదర్శకంగా జరగాలనే ఉద్దేశంతో పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈనెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వరకు వివరాల నమోదు చేసేందుకు అవకాశం కల్పించారు. స్థానిక కేజీబీవీలో ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరంలో 40 సీట్లు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు గడువులోపుల ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

పశుగ్రాసం లేక ఇబ్బందులు


ట్రాక్టర్లలో తరలిస్తున్న పశుగ్రాసం

దొనకొండ: వేసవి కాలం కావడంతో పశుగ్రాసం ధర కొండెక్కింది. దీంతో పశు పోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది వచ్చిన తుఫాన్‌లకు పశుగ్రాసం కరువైంది. చెరువుల్లో చుక్క నీరు లేక ఎండిపోయింది. పశుపోషకులు గ్రాసం కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రాసం కొనలేని వారు గేదెలను సంతలో పశువులను విక్రయిస్తున్నారు. మండలంలో 18 గ్రామ పంచాయతీల పరిధిలో తెల్లజాతి ఆవులు, ఎద్దులు సుమారు 1700, నల్లజాతి గేదెలు సుమారు 16000 మూగ జీవాలు ఉన్నాయి. పశుగ్రాసం కొరతతో రైతులు ట్రాక్టర్ వరిగడ్డిని సుమారు రూ. 15 వేలకు కొనుగోలు చేస్తున్నారు. దూర ప్రాంతమైన దర్శి, వినుకొండ ప్రాంతాల నుంచి ప్రతి రోజూ ట్రాక్టర్లపై వరి గడ్డిని తరలిస్తున్నారు. గేదెల మేత కోసం పొలాల వెంట తిరిగినా మూగ జీవులకు డొక్క నిండటం లేదని పశుపోషకులు ఆవేదన చెందుతున్నారు.

ఎమ్మెల్యే బూచేపల్లికి అభినందనలు


శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మలను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: వైఎస్సార్ సీపీ పార్టీలో పదవి ఇచ్చినందుకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ వింగ్ సహాయ కార్యదర్శి కాసు శ్రీనివాస రెడ్డికి పదవి ఇచ్చినందుకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలకు వారి నివాసంలో కలసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మలను దుశ్శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం మాజీ రాష్ట్ర కార్యదర్శి దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ యరమల మధుసూదన్‌రెడ్డి, సోషల్ మీడియా మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కో కన్వీనర్ వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ భవనం మురళీ, తదితరులు పాల్గొన్నారు.

దేవప్రసాద్ కుటుంబానికి పరామర్శ..

ప్రకాశం జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్ భార్య అనారోగ్య కారణంతో బాధపడుతుండగా వైఎసార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలను పరామర్శించిన బూచేపల్లి

కురిచేడు: మండలంలో అనారోగ్యానికి గురైన పలువురు నాయకులు, కార్యకర్తలను శివప్రసాదరెడ్డి పరామర్శించారు. మండలంలోని బోదనంపాడు గ్రామ మాజీ సర్పంచ్ బత్తుల చిన సుబ్బయ్య అనారోగ్యంతో బాధపడుతుంటే ఆయనను పరామర్శించి ఆరోగ్యంపై ఆరాతీశారు. అనంతరం స్థానిక పడమర హరిజనవాడకు చెందిన బత్తుల నరసింహారావు కుమారులు చెరువులో మునిగి మృతి చెందారు. వారిని పరామర్శించి ధైర్యం చెప్పి ఆర్థిక సాయం చేశారు. మండలంలోని పడమర నాయుడుపాలెం మాజీ సర్పంచ్ బీ వెంకయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మరో నాయకుడు బొమ్మినీడి చెంచయ్య, కార్యకర్త షేక్ రసూల్‌ను పరామర్శించి అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆవులమంద గ్రామంలో తిరునాళ్ల సందర్భంగా గాయపడిన కార్యకర్త గొట్టిపాటి వెంకట్రామయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ వైవీ సుబ్బయ్య, జెడ్పీటీసీ ఎస్ వెంకట నాగిరెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కొల్లా భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్.అమీన్ బాషా, ఎంపీటీసీ బీ వెంకటనర్సయ్య, కురిచేడు, పడమరనాయుడుపాలెం సర్పంచ్‌లు కేసనపల్లి కృష్ణయ్య, బీ మహేష్, నాయకులు మేరువ పిచ్చిరెడ్డి, కండె గంగయ్య, షేక్.సైదా, రమణారెడ్డి, గుంటక నాసరరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, తేలుకుట్ల శ్రీనివాస రెడ్డి, కోలా సంతోష్ కుమార్, అంకె కృష్ణ, వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి నాగిరెడ్డి, వేమా చిన్న ఆంజనేయులు, కొలూరి నర్సింహులు, యరమల మధు, పెంద్యాల గుర్నాథం, నుసుం సుబ్బారెడ్డి, ఎస్వీ నాగిరెడ్డి, ఇందూరి సుబ్బారెడ్డి, నుసుం ప్రతాపరెడ్డి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


దేవప్రసాద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న బూచేపల్లి


వెంకయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి


చెంచయ్యను పరామర్శించి ధైర్యం చెప్తున్న శివప్రసాదరెడ్డి

చలివేంద్రం అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల కన్వీనర్ రమణారెడ్డి

పెద్దదోర్నాల: ఉచిత చలివేంద్రాన్ని పాదచారులు, యాత్రికులు వినియోగించుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిన్నదోర్నాల అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సెంట్రల్ చర్చ్ ఆఫ్ క్రైస్ట్ డైరక్టర్ సింగా రాజేష్, సిస్టర్ సింగా ఎస్తేర్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా క్రమం తప్పకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఆక్టివిస్ట్ సింగా ప్రసాద్, నియోజకవర్గ పాస్టర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ చాట్లగంగయ్య, సింగా ఏసన్న, ముండ్ల చిన్న కోటయ్య, మందా నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ చిరస్మరణీయుడు


ఎస్వీఆర్ స్కూల్‌లో మాట్లాడుతున్న కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి

దర్శి: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ చిరస్మరణీయుడు అని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలో భగత్ సింగ్ 94వ వర్ధంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల గ్రౌండ్ వద్ద వాకర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ భవనం కోటిరెడ్డి, పాపసాని రాజశేఖరరెడ్డి, ధనిరెడ్డి వెంకటరెడ్డిలు భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడుగా భగత్‌సింగ్ చేసిన త్యాగం మరువలేనిదన్నారు. ప్రతి ఒక్కరూ భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య, నాయకులు సందు వెంకటేశ్వర్లు, షేక్ పీరా సాహెబ్, కళ్యాణ్, ఆదినారాయణ వాకర్ అసోషియేషన్ సభ్యులు బెలుం సుబ్బారెడ్డి, బేతా శ్రీనివాస రెడ్డి, రంగారావు, దిడ్ల రమేష్, అంకయ్య, బుర్రిశ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తి కలిగి ఉండాలి..

ప్రతి ఒక్కరూ భగత్‌సింగ్ స్ఫూర్తి కలిగి ఉండాలని ఎస్వీఆర్ స్కూల్ కరస్పాండెంట్ చింతా తిరుపతి రెడ్డి అన్నారు. స్థానిక ఆపాఠశాలలో భగత్‌సింగ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ బీసీ హాస్టల్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ సంరక్షణ మన కర్తవ్యం

తాళ్లూరు: ఎన్నో సంవత్సరాలుగా ఉన్న చెట్లను తాత్కాలికమైన అవసరాల కోసం నరికేయడం వలన భవిష్యత్‌లో మానవాళికి పెద్ద ముప్పు ఉంటుందని ఏఓ ప్రసాద్‌రావు తెలిపారు. మండల కేంద్రం తాళ్లూరులో ఆదివారం ప్రపంచ వాతావరణ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ తమవంతుగా నేల, నీరు కాలుష్యం అవ్వకుండా చూడాలని, ప్రకృతిని జీవుల మనుగడను కాపాడాల ని ఆయన తెలిపారు. వాతావరణ కాలుష్యం వలన పైర్లకు, పశువులకు, మనుషులకు వింత రోగాలు వస్తాయన్నారు. వీటన్నిటిని అరికట్టాలంటే అధికంగా చెట్లు పెంచాలన్నారు. ఇప్పటికైనా మేల్కొని విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన సూచించారు.

కళలు, చేతిపనులతో విద్యార్థుల్లో సృజనాత్మకత


తయారు చేసిన కళలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దర్శి: ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్(కళలు, చేతిపనులు) విద్యార్థుల జీవితంలో సృజనాత్మకతకు దోహదపడతుందని క్రాఫ్ట్స్ టీచర్, రిసోర్స్ పర్సన్ ఎమ్ నాగేశ్వరి పేర్కొన్నారు. స్థానిక ప్రశాంత స్కూల్ స్టెప్ ఆడిటోరియంలో విద్యార్థులకు ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ పై మొదటి విడత వర్క్‌షాప్‌లో భాగంగా విద్యార్థులకు శిక్షణ ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఎవరి మీద ఆధార పడకుండా వారి పనులు వారు సొంతగా చేసుకోగలుగుతారని చెప్పారు. విద్యార్థులు తయారు చేసిన రకరకాల డిజైన్‌లు, ఫోటోలను చిత్రీకరించారు. కార్యక్రమంలో క్యాంపస్ ఇంచార్జ్ ఎస్ మాల్యాద్రి, ఎన్‌సీహెచ్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

చీకట్లో ప్రభుత్వ కార్యాలయాలు


మసక చీకట్లో ఎంపీడీవో కార్యాలయం

పెద్దారవీడు: ప్రభుత్వ మండల కార్యాలయాల ఆవరణంలో విద్యుత్ లైట్లు లేకపోవడంతో చిమ్మ చీకట్లో కనిపిస్తున్నాయి. మండలంలో ఏ గ్రామం అభివృద్ధి చెందాలన్నా, వీధిలైట్లతో వెలుగులు నింపాలన్నా అందుకు నిధులు సమకూర్చాల్సింది మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయమే. అలాంటి కార్యాలయానికే వెలుగు లేక చిమ్మ చీకట్లో మగ్గుతోంది. అలాగే గ్రామానికి చివర ఉన్న ఉపాధీ హామీ పథకం, విద్యాశాఖ, వెలుగు, వ్యవసాయ, హౌసింగ్ శాఖల కార్యాలయాల ప్రాంగణంలో ఒక్క లైటు కూడా వెలిగించలేని దీనస్థితిలో అధికారులు ఉండడం గమనార్హం. మండల కార్యాలయం ఆవరణంలో ఉన్న విద్యుత్ స్తంభం ఉన్నప్పటికీ లైటు ఏర్పాటు చేయలేదు. ఎన్నో దస్త్రాలు, సంక్షేమ పథకాలు సంబంధించిన రికార్డులు, ఇతర విలువైన సామగ్రి ఉన్న కార్యాలయాలను ఇంత నిర్లక్ష్యంగా ఉంచడం సరికాదని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి రాత్రి సమయంలో లైట్లు వేయాలని, కాపలా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి కందుల కొనుగోలు

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో కందులు కొనుగోలు చేస్తారని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 24వ తేదీ నుంచి పుల్లలచెరువులో మార్క్‌ఫెడ్ ద్వారా పీఏసీఎస్‌లో కందులు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, క్వింటా ధర రూ.7550 నిర్ణయించారన్నారు. కందులు పండించిన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

కాపీలు రాయిస్తే వెనుకేసుకొస్తారా !

తాళ్లూరు (దర్శి): విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు తప్పుదోవ పడుతున్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులకు కాపీలు చేయించి పరీక్షలు రాయించిన బాగోతం బట్టబయలైంది. అటు వంటి ఉపాధ్యాయులను అన్నీ జిల్లాల్లో సస్పెండ్ చేస్తున్నా ప్రకాశం జిల్లా డీఈఓ మాత్రం వారిని పరీక్షల నుంచి రిలీవ్‌తో సరిపెట్టడం పై పలు అనుమానాలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళితే మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో జాహ్నవి స్కూల్‌లో పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షలకు డీఓగా దర్శి మండలం పొతకమూరు జెడ్పీహెచ్ఎస్ గణిత ఉపాధ్యాయుడు ఎమ్ యలమందారెడ్డి, పరీక్షలు చీఫ్‌గా పోతవరం జెడ్పీ హెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఎస్ వెంకటేశ్వర్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజు పరీక్షల్లో కాపీలు జరుగుతుండటంతో ఆ విషయాన్ని పిల్లలు చెప్పడంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చింది. దీనికి తోడు హిందీ పరీక్ష జరిగిన కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఓ హిందీ ఉపాధ్యాయుడి,ఇ అదే పరీక్ష కేంద్రంలో ఉంచుకున్నారు. ఆ ఉపాధ్యాయుని పిల్లలు కూడా అదే సెంటర్‌లో పరీక్ష రాస్తున్నట్లు సమాచారం. విద్యార్థులను కాపీయింగ్‌కు ప్రోత్సహించారని విద్యార్థుల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఈఓ అక్కడ పరీక్షలు జరిగిన తీరు పై విచారణ జరపగా డీఓ, పరీక్ష చీఫ్‌లే కాపీలు చేయించినట్లు రుజువైంది. దీంతో వారిని డీఈఓ సస్పెండ్ చేయాల్సి ఉండగా పరీక్షల నుంచి రిలీవ్ మాత్రమే చేసి సరిపెట్టారు. వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ పరీక్షల కాపీయింగ్ బాగోతంలో భారీ ఎత్తున ముడుపులు ముట్టినట్లు చర్చించుకుంటున్నారు. మళ్లీ కాపీయింగ్‌లు జరగకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.